
"నమస్తే!" అంది నీలవేణి.

నీలవేణిని అలా చూడటం అదే మొదటిసారి. గతంలో ఒకసారి ఆమెను చూశాను. కానీ ఆ రోజు నాకు కనపడ్డ నీలవేణి ఈమె కాదు. ఆ రోజు నీలవేణి మగాడి వేషంలో ఉంది. 'శ్రీకృష్ణలీలలు' నృత్యనాటకంలో కృష్ణుడు నీలవేణి ఆడదైనా మగాడిగా బాగా నటించింది. దానికి కారణం బహుశా ఆమె వేసుకొన్న వేషం కూడా కావచ్చు. మామూలుగా స్త్రీకి ఉండే ఎత్తు పల్లాలన్నిటినీ మేకప్ చేసేటప్పుడు ఏం మాయ చేశారో కానీ, స్టేజీ ముందు కూర్చొని నాటకం చూస్తున్న మాకు మాత్రం అవి కనపడనే లేదు. ఆ రోజు ఆమె ఆడది అని తెలుసు కనుక దృష్టి సహజంగానే ఆ ఎత్తు పల్లాల మీదికి మళ్ళాయి.

ఇప్పుడు నీలవేణిని చూస్తోంటే ఆ రోజు సంగతి గుర్తొచ్చింది. కానీ ఈ రోజు-పరిస్థితి మారింది. నన్ను నేను సంబాళించుకొంటూ ఆమెకు ప్రతి నమస్కారం చేశాను "నమస్కారం!" అంటూ.

"మీ గురించి వినటమే కానీ, ఎప్పుడూ కలుసుకొనలేదు" అంది నీలవేణి.

"నేనయితే మీ గురించి వినటమే కాదు-విన్నది నిజమని కూడా కళ్ళారా చూశాను" అన్నాను నేను.






కథా నిలయం
శ్రీకాకుళం

"ఎప్పుడొచ్చారు మీరు?"

"ఆ రోజు రవీంద్ర భారతిలో 'శ్రీకృష్ణలీలలు' వేశారు చూడండి- ఆ రోజు వచ్చాను!"

"చంపారు. అంటే నన్ను కృష్ణుడిగా చూశారన్నమాట! అసలు ఆ రోజు నేను స్టేజీ ఎక్కనే కూడదు. పర్యవేక్షణ కార్యక్రమం మాత్రమే నాది. కానీ కృష్ణుడి వేషాన్ని వెయ్యాల్సిన శాంతి రాక పోవటంతో ఆ వేషం నేను వెయ్యాల్సి వచ్చింది. ఏదో ఆదరా బాదరగా వేసిన వేషం అది!"

"అయినా బాగా చేశారు!"

"అదే విచిత్రం! ఎంతో ప్రాక్టీస్ చేసి స్టేజీ ఎక్కిన రోజు బాగుందని ఎవరూ అనరు. ఆషామాషీగా స్టేజీకి వచ్చేస్తే, వేసే వేషం ఆడో మగో తెలీక, చూపించాల్సింది పురుషత్వమో, బానిసత్వమో అర్థం కాక తికమకపడ్డ రోజున-అద్భుతం అనేస్తారు అంతా!" నీలవేణి నవ్వింది.

నాకూ నవ్వొచ్చింది.

"ఆలస్యంగా అయినా చెప్తున్నా- నేను చాల రోజులనుంచి మిమ్మల్ని కలుసుకోవాలని అనుకొంటున్నాను!"

"ఏం?"

"ఏం అంటే ఏం చెప్పను? మీ గురించి సూర్యం చెప్పే విషయాలు కావచ్చు. లేదా మీ గురించి పేపర్లో రాసే విశేషాలు కావచ్చు. మొత్తం మీద నాలో ఆసక్తి కలిగించిన మాట వాస్తవం! చూడాలని చాలా రోజుల నుంచీ అనుకొంటున్నాను!"

"థాంక్సండి! చూశారు కదా, ఏమనుకుంటున్నారు? ఇలా అడుగుతున్నానంటే కారణం- ఒక మనిషిని చూడగానే ఒక్కోసారి మన అభిప్రాయాలు మారిపోతుంటాయి!"

"మీ విషయంలో కాదులెండి! డాన్స్ అంత బాగా చేస్తారు కదా, మీ నడక ఎలా ఉంటుందో అనుకొన్నాను. మామూలుగానే ఉంది. వేషంలో బాగున్నట్లు అనిపిస్తారు కదా, వేషం తీసేస్తే ఎలా ఉంటారో అనుకొన్నాను. మామూలుగానే ఉన్నారు!"

"నిజమేనండీ! నేను చాల మామూలు ఆడదాన్ని. డాన్స్ అంటే అది స్టేజీ వరకే. వేషం అంటే అది ఆ గంట వరకే. జీవితంలో ఎక్కడ నటించగలం చెప్పండి?" అంది నీలవేణి.

'సూర్యం తెలివైన వాడు' అనుకొన్నాను. మామూలు ఆడదాన్నే- అనుకొంటున్న స్త్రీని కోరు

కుంటున్నాడు కాబట్టి....

*　　*　　*

సూర్యం ఓ చిన్న ఆఫీసులో మామూలు గుమాస్తా. కానీ మని షిలో కలుపుగోలుతనం కొండంత ఉంది. అందిస్తే అల్లుకుపోయే తత్వం అతనిది. అందుకే నీల వేణిని ఆప్యాయంగా అల్లుకుపోయే ప్రయత్నాలలో పడ్డాడు.

"పోనీ పెళ్ళి చేసుకోరాదూ?" అన్నానో రోజు సూర్యాన్నినిలదీసి.

సూర్యం నవ్వాడు. "ఇపుడు పిరీయడ్" అన్నాడు.

నా కర్థం కాలేదు. "అంటే?" అని ప్రశ్నించాను.

"పెళ్ళి చేసుకోదల్చుకొన్న ఆడదానిలో మనకు కావల్సిన లక్షణాలు అన్నీ ఉన్నాయో లేదో చూసుకోవటం మంచిదిరా!గుర్రాన్ని కొంటున్నాం అనుకో- సుడులు చూసుకొని కొంటాం. ఆవునో, ఎద్దునో కొంటామనుకో-అప్పుడు పళ్ళు చూసి కొంటాం. ఇదీ అంతే! ఇంటికో ఆడదాన్ని తెచ్చుకొంటున్నా మంటే ఆ ఆడదానికి అన్ని లక్షణాలు సరిగ్గా ఉన్నాయా అని చెక్ చేసుకోవటం మంచిది. అంటే మనం అబ్జర్వ్ చేసుకోవటమన్న మాట! ఇపుడు నీలవేణి అబ్జర్వే షన్‌లో ఉంది. ఇది అబ్జర్వేషన్ పిరీయడ్" అన్నాడు సూర్యం.

వాడి లాజిక్ నవ్వు తెప్పించింది. పద్ధతి బాగుంది కానీ ఫలితం ఎలా ఉంటుందో చెప్పటం కష్టం. అయినా ఆడదాన్ని ఇలా పిరీడ్స్‌లో ఉంచామని చెపితే ప్రమాదం కూడాను! అదే అన్నాను.

"ఇదేం పబ్లిక్ ఎగ్జామినేషనా ఏం? హాల్ టికట్ ఇచ్చి, ఓ రోల్ నంబర్ ఇచ్చి టైంటేబిల్ ప్రకారం పరీక్షించటానికి? దిసీజ్ ప్యూర్లీ ప్రైవేట్ ఎఫైర్. నువ్వు అబ్జర్వేష న్‌లో ఉన్నావని చెబితే ఏ ఆడ దైనా జాగ్రత్తగానే ఉంటుంది. అందుకే నీలవేణికి ఆ సంగతి చెప్పలేదు. ఏకంగా ఒకేసారి రిజల్ట్స్ ఇచ్చేస్తా!"

సూర్యం అవస్థ చూసి జాలే సింది. నిజానికి ఇలాంటి శీల పరీ క్షలు పెట్టినట్లు తెలిస్తే ఆ ఆడదీ తిరుగబాటే చేస్తుంది. కానీ సూర్యం ఆ విషయంలో జాగ్రత్త పడు తున్నట్లు నాకు చెప్పాడు.

నీలవేణి అందంగా ఉంటుంది. నిజానికి నలుపు రంగుకిందే లెక్క-గానీ, ఆ నలుపులో ఆకర్షణ ఉంది. నాట్యం అభ్యసించడంవల్ల శరీ రంలో అంగాలన్నీ తగు మాత్రపు మోతాదుల్లో పెరిగి ఆమెకు వన్నెలు తెచ్చాయి. సూర్యానికి నాట్యం

అంటే పెద్ద మోజు ఏదీ ఉన్న సంగతి నాకు తెలీదు. కానీ, ఈ మధ్య అతని చేతిలో కొన్ని పుస్తకాలు- నటరాజ రామకృష్ణ నుంచి జాయాపసేనాని వరకు అందరూ రాసిన పుస్తకాలు మాత్రం కన పడ్డాయి.

"అర్థమవుతున్నాయా?" అనడిగాను వేళాకోళంగా.

"భాష నాకు అర్థం అయినా కాకపోయినా, నా బాధ నీలకు అర్థమయితే చాలు!" అనేశాడు సూర్యం.

నిజాయితీపరుడు!

"మరి పెళ్ళి చేసుకోనున్నట్లు చెప్పచ్చు కదా?" అనడిగాను.

"నిజం చెప్పనా? నాకు నీలవేణిని అలా అడిగే ధైర్యం ఇంకా రాలేదు. అందుకే అబ్జర్వేషన్ అంటున్నాను. ఈలోగా నాకు కొంచెం ధైర్యం వస్తే, అప్పటికి నీలవేణి గుణం గురించి, పద్ధతుల గురించి నాకు మరికొంచెం తెలుస్తుంది. అప్పుడు నా జీవితంలోకి పిలుస్తాను!"

సూర్యం నిజాయితీ నిజంగా నాకు నచ్చింది. ధైర్యంగా తనకు ధైర్యం లేదని అంటున్నాడు.

"పోనీ నేను వెళ్ళి అడగనా ఆవిడను?" అన్నాను.

"ఇంకొన్నాళ్ళు ఆగు. ఎలాగైనా నీలవేణి కల్యాణంలో నువ్వే పురోహితుడివి! నాచేత నువ్వే తాళి కట్టించాలి" అన్నాడు సూర్యం.

ఈలోగా తన ప్రయత్నాలలో తాను మునిగి తేలుతూనే ఉంటా డన్న మాట!

నీలవేణి ఎక్కడైనా నృత్య ప్రదర్శన ఇస్తోందంటే, అక్కడ సూర్యం వారం రోజుల ముందు కనిపిస్తాడు-ఫలానా రోజున ప్రదర్శన, మీరు రండి అంటూ పోస్టరులు అతికించే ఏర్పాట్లు చేయిస్తూ. టిక్కెట్లు కొంటారనుకొనే వారికి అమ్ముతాడు. కొనరు అనుకొనే వారికి ఆహ్వానాలు ఇస్తాడు. ఇక ప్రదర్శన రోజున ఒకటే హడావిడి! ముందు నాట్య ప్రదర్శన గురించి పరిచయ వాక్యాలు రాసి పంచి ఇస్తాడు. తర్వాత-గతంలో నీలవేణి సాధించిన విజయాలను ఏకరువు పెడతాడు. అసలామె తెలుగు కళకు అంకితమవటానికి పొరబాటున తెలుగు దేశంలో పుట్టేసిందని, దాని వల్ల తెలుగుదేశానికే కీర్తి కిరీటం లభ్యమవుతోందని తెగ బాధ పడిపోతాడు. నృత్యం పూర్తయిన తర్వాత నీలవేణిని సజావుగా ఇంటికి చేర్చే అదనపు సెక్యూరిటీ బాధ్యతలూ అతనే స్వంతం చేసు

కొంటున్నాడు ప్రతిసారి.

నీలవేణి సూర్యాన్ని చేసుకొంటే సుఖపడుతుంది. కళకు ఇంత ప్రోత్సాహం ఇచ్చే భర్త దొరకటం ఆడదాని అదృష్టమే!!

నెలరోజుల తర్వాత అనుకొంటాను-నేను రేడియో స్టేషన్‌లో ఏదో రికార్డింగ్‌కు వెళ్ళి బయటకు వస్తోంటే ఎదురుగా అసెంబ్లీ చెట్ల కింది పేవ్‌మెంట్ మీద నీలవేణి, సూర్యం నడుస్తూ కనపడ్డారు. త్వర త్వరగా నాలుగైదు అడుగులు వేసి వాళ్ళను కలుసుకొన్నాను. తీరా చూస్తే అతను సూర్యం కాదు!

నీలవేణితో శేఖరాన్ని చూడటం నాకు కొంచెం ఇబ్బందిగానే ఉంది. శేఖరం సూర్యానికి బాబాయ్ కొడుకు. ఏదో పెద్ద ఇంజనీరింగ్ సంస్థలో పెద్ద పోస్టులోనే ఉన్నాడు. ఇటీవలే దేనికో ట్రైనింగ్ కని జెకొస్లవేకియా కూడా వెళ్ళొచ్చాడు. తిరిగి వచ్చాక శేఖరం ఇచ్చిన పార్టీకి సూర్యం నన్ను బలవంతాన లాక్కెళ్ళాడు- 'రారా! మా ఇంట్లో నీకు తెలీని జనాభా ఎవరు? ఫర్వాలేదు' అంటూ. మొహమాట పడుతూనే వెళ్ళాను. కానీ శేఖరం చాలా బాగా పలకరించి, నన్ను ముగ్ధుణ్ణి చేశాడు. 'గర్వంలేని మనిషి' అనుకొన్నాను.

అసెంబ్లీ చెట్ల నీడలు సాయంత్రం ఎండకు పొడుగ్గా ఉన్నాయి. శేఖరం, నీలవేణి నీడలు కూడా చాలా పొడుగ్గా ఉన్నాయి. వాళ్ళకన్నా వాళ్ళ నీడలే ఎంతో పొడుగు. కనిపించే మనుషులకన్నా, కనపడని వాళ్ళ భావాలు నాక్కొంచెం భయాన్ని కలుగజేశాయి లోలోపల. ముభావంగా మాట్లాడి తప్పించుకొన్నాను.

మర్నాడు పదీ పదిన్నరకు సూర్యానికి ఫోన్ చేశాను. ఉన్నాడని తెలీగానే వస్తున్నానని చెప్పి ఆటోలో వెళ్ళాను.

"నిన్న నాకు శేఖరం కనపడ్డార్రా నీలవేణితో" అన్నాను- ఉపోద్ఘాతం లేకుండా ఏకంగా పాయింట్‌లోకి వచ్చేస్తూ.

"అవును, నిన్న శేఖరం వాళ్ళ ఆఫీసులో కల్చరల్ క్లబ్ వార్షికోత్సవం ఉంది. దాంట్లో నీలవేణి డాన్స్ కూడా ఉంది!"

"నువ్వే ఏర్పాటు చేశావా?"

"ఊహుఁ- శేఖరమే మాట్లాడుకొన్నాడు."

"శేఖరానికి నీలవేణి ఎలా తెలుసు?"

"నేనే పరిచయం చేశాన్రా! 'మా ఆఫీసులో నీలవేణి డాన్స్ ఏర్పాటు చేయిస్తా-వెళ్ళి మాట్లాడ

దామా?' అంటే తీసుకెళ్ళాను!"

"మరి నిన్ను పిలవలేదా ఫంక్షన్‌కు?"

సూర్యం నవ్వాడు. క్షణం తర్వాత అన్నాడు- "నాకు వీల్లేక పోయింది."

"పిలిచారా-లేదా? అది చెప్పు!"

"అది వాళ్ళకు వీలుపడ లేదేమో!"

"నీ కసలు బుద్ధి లేదురా సూర్యం!" అన్నాను. నీలవేణి డాన్స్ ప్రోగ్రాంను సూర్యం హడావిడి లేకుండా నే నసలు ఊహించుకోలేక పోతున్నాను. మరి నీలవేణి మనసెలా ఒప్పిందో నాకు అర్థం కావటం లేదు.

క్షణం ఆగి అన్నాడు సూర్యం- "వచ్చిన పని దీని విషయమేనా?"

"అవును. నువ్వు నీలవేణిని మర్చిపోవడం మంచిదిరా! ఆ సంగతి చెప్పిపోవాలని వచ్చాను" అంటూ ఇంకక్కడ ఉండటం యిష్టంలేక అదే ఆటోలో వెనక్కి వచ్చేశాను.

మనసంతా చికాగ్గా అయిపోయింది. కాసేపు అటూ యిటూ తిరిగి ఆఫీసులో సీటుకు చేరుకొనే సరికి నా కోసం సూర్యం రెడీ!

కాంటీన్ దగ్గర వేపచెట్టు క్రిందకు చేరాం. సూర్యం పరిస్థితి మరీ ఇదిగా వుంది.

"ఏమిటి? చెప్పు!" అన్నాను నేను విసుగ్గా.

"నీలవేణి విషయం...."

"వెళ్ళి మాట్లాడనా? అటో యిటో తేల్చేయనా?"

"ఫర్వాలేదంటావా?"

"ఫర్వాలేదు. ఊఁ- అను!" అన్నాను.

సూర్యం క్షణం ఆగి అన్నాడు- "వద్దులేరా! శేఖరానికి తెలుసు- నీలవేణిని నేను పెళ్ళి చేసుకోవాలనుకొంటున్నానని! అదే నమ్మకం వాడు నాకు ద్రోహం చెయ్యడని. పైగా నీలవేణి సంగతీ నాకు తెలుసు."

"నిజమే! నీలవేణి సంగతి నీకు తెలుసు. కాదనను. కానీ మామూలు ఆడపిల్లల తల్లిదండ్రుల సంగతి నీకు తెలీదు. వాళ్ళ పద్ధతులు, అభిప్రాయాలు నీకు తెలీవు, నాకు తెలుసు. అసలా శేఖరం గురించి కూడా నీకు సరిగ్గా తెలీదు. కానీ నేను అంచనా వేయగలుగుతున్నాను."

"అంతే నంటావా?"

"అక్షరాలా అంతే! అది చాలా మామూలు బలహీనత."

"కానీ నేను వాడికి బెస్టు ఫ్రెండ్‌నిరా! పైగా వాడు నాకు

తమ్ముడవుతాడు కూడా."

"ఏడిశావ్! రంభా ఇలాగేఅంటే రావణుడు కొట్టిపారేసాట్ట- 'వావి వరసలు ఏమిటే? నువ్వు ఆడదానివి, నేను మగాణ్ణి- అదే దగ్గరి చుట్టరికం' అని. అయినా నీ యిష్టం. శేఖరాన్ని నమ్మకు- అదొకటే సలహా."

"నేనలా అనుకోను!"

"నీ ఖర్మ. వాడు నీకన్నా అన్నిటా అధికుడు. నీకన్నా జీతం ఎక్కువ. మంచి ఉద్యోగం. నువ్వు ఈ ఊరు నాలుగు మూలలూ చుట్టి రాలేదు. అతను జెకొస్లవేకియా వరకు వెళ్ళొచ్చాడు. ఇవి చాలు- నీకు ఎసరు పెట్టటానికి."

"ఇవన్నీ ఓ ఎత్తురా! నీలవేణి ప్రేమ సంగతి నీకు తెలీదు. ప్రాణం ఇచ్చేస్తుంది నేనంటే."

"పోనీ-ఆ సంగతి కన్‌ఫర్మ్ చేసుకో! నీలవేణి నీదేనని స్పష్టంగా తేలాక, ఆ తర్వాత శేఖరంతో తిరిగినా, రాజశేఖరంతో తిరిగినా వర్రీ అవకు!"

"వర్రీ నీకే కాని నాకుకాదురా!" అన్నాడు సూర్యం.

ఇంకేమీ మాట్లాడ లేదు. వచ్చేశాను నా సీట్లోకి. వేపచెట్టు క్రింద వెర్రి వెధవ కొంతసేపు అలానే నిలబడి వెళ్ళిపోయి ఉంటాడు- నాకు తెలుసు వాడి మన స్తత్వం.

ఆ తర్వాత- శేఖరం, నీలవేణి నాకు ఆబిడ్స్‌లో కనబడ్డారు. లైలా మజ్నూ సినిమా చూస్తూ కనబడ్డారు. ఆటోలో కనబడ్డారు. నడుస్తూ, మాట్లాడుకొంటూ కనబడ్డారు. పాపిష్టి కళ్ళు అన్నీ చూస్తూనే ఉన్నాయి. అయినా పేలిపోలేదు.

కానీ, మనసు మాత్రం కుతకుతలాడిపోయింది. ఉండబట్టలేక పోయాను. ఒకరోజు సెలవుపెట్టి శేఖరం ఆఫీసుకు వెళ్ళాను. అతన్ని బయటకు పిలిచి చెడా మడా చీవాట్లు పెట్టేశాను.

శేఖరం అంతా విని తర్వాత నెమ్మదిగా అన్నాడు- "మిస్టర్! మీరన్నది రైటే. కాదనను. స్నాచింగ్ అదర్స్ గర్ల్స్ ఈజ్ రాంగ్. కానీ నీలవేణి అదర్స్ గర్ల్ కాదు కదా! పెళ్ళికాని ఆడవాళ్ళంతా జాతి సొమ్ము అనే నేను నమ్మతాను. ఆ జాతి సొమ్ములో ఎవరి కెంత ప్రాప్తమో అంతే లభిస్తుంది. ఖాళీజాగాను ఆక్రమించుకోటానికి సూర్యమూ, నేనూ ఇద్దరమూ ప్రయత్నించాం! ఎవరు బలవంతులో వాడికే ఆస్తి. రాజ్యం వీర భోజ్యం అని సూక్తి. అదే జరిగింది!"

"అంటే?"

"అంటే ఏముంది? సూర్యం ఇప్పుడే ప్రెస్‌కు వెళ్ళాడు."

"దేనికీ? తనకు జరుగుతున్న అన్యాయాన్ని గురించి కరపత్రాలు వేయటానికా?"

శేఖరం నవ్వేశాడు-"బాగుంది. కాని చెప్పాగదా, వాడు ఆ విషయంలోనూ పూరే! వాడికి అది తట్టలేదు. నీలూకి నాకూ పెళ్ళి. శుభలేఖల ప్రూఫ్‌లు చూట్టానికి ప్రెస్‌లో ఉన్నాడు సూర్యం."

ఆశ్చర్యపోయాను. దిగులు పడ్డాను. ప్రెస్‌కు వెళ్ళాను. నిజమే- శేఖరం అన్నది నిజమే! శుభలేఖలో పడ్డ అచ్చు తప్పుల్ని సూర్యం దిద్దుతున్నాడు. వెధవ-జీవితంలో అచ్చు తప్పుల్ని అలాగే వదిలేశాడు!

అయినా పెళ్ళికి వెళ్ళాను. ప్రేయసి పెళ్ళిలో పక్కన కూర్చోవలసిన సూర్యం అక్షింతల్ని పంచుతూ కనబడ్డాడు.

ఓడిపోయాడు- లవ్ వార్‌లో-కాదు, ఆల్ ఈజ్ ఫెయిర్ ఇన్ లవ్ అండ్ వార్! ఈ ఫెయిర్ వార్‌లో సూర్యం దారుణంగా ఓడిపోయాడు.

అక్షింతల్ని పంచుతున్న సూర్యాన్ని సానుభూతితో చూశాను. సూర్యం కళ్ళు అక్కడే తిరుగుతున్న ఓ అమ్మాయి వైపే ఉన్నాయి.

ఆ అమ్మాయి పేరు చామంతి అని ఆ తర్వాత నాకు తెలిసింది.

జీవితం ఓ పోరాటం. సూర్యం ఇప్పుడు మరో యుద్ధక్షేత్రానికి చేరాడు.

అక్కడ యుద్ధం అయినా ఫెయిర్ వుంటే మంచిదే! కాకపోతే- మరో అమ్మాయి.

శేఖరం అన్నట్లుగా పెళ్ళికాని అమ్మాయిలు జాతి ఆస్తి.

తన స్వంత ఆస్తి ఎక్కడుందో అనే అన్వేషణలో పడిపోయాడు సూర్యం. ✱

---

Edited & Published by VIJAYA BAPINEEDU
80, Dhanalaxmi Colony, Madras- 600 026 and,
Printed by him at Vijaya Graphics;
210-Arcot Road, Madras-600 026. Phone: 422233